# శాప ఫలం



**హుషారుగా** ఈల వేసుకుంటూ గదిలోకి అడుగు పెట్టాడు హమీద్. చేతిలోని పుస్తకాన్ని బల్లమీదికి విసురుగా పడవేసి కుర్చీలో కూలబడ్డాడు.

"ఒరేయ్, రవీ! ఈ దినమయినా నీవు రావాలిరా. నిన్న ఆట మాంచి జోరుగా ఉందిలే. నా బౌలింగ్‌కు ఆ ఇంజనీరింగు కుర్రాళ్ళు హడిలి చచ్చారనుకో! ఈరోజు ఆట ఇంకా గొప్పగా ఉంటుంది. ఫైనల్సు కూడాను..."

రవి మాట్లాడలేదు. తలవంచుకొని కెమిస్ట్రీ రికారు వ్రాసుకుంటున్నాడు.

హమీద్‌కు పెద్ద చిరాకు వేసింది. తన ఆట ప్రావీణ్యాన్ని మిగతా కుర్రాళ్ళు అంతా ఎంతో పొగిడేసి తనను ఆకాశానికి ఎత్తివేస్తుంటారు. కాని, ఈ రవి మట్టుకు కనీసం ఒక్క మంచి మాటయినా అనడు. 'అయినా వీడికేం తెలుసు నా ఆట సంగతి? ఈసారి చూపించి వీడికి విర్రెత్తించాలి' అనుకున్నాడు.

"చప్పున లేవోయ్, ఈ చిట్టా తరవాత వ్రాద్దు కాని." రవి చేతిలో పెన్ను విసురుగా లాగేశాడు హమీద్.

రవి అతనివంక చూసి వెర్రిగా, జాలిగా నవ్వాడు. అతడు ఆలా నవ్వుతూంటే హమీద్‌కు ఒళ్ళు మండింది. కాని, ఈసారి ఎంతో సహనంతో—

"తప్పక రావాలిరా, రవీ!" అని ప్రాధేయపడుతూ అన్నాడు.

రవి తలవంచుకున్నాడు. "నేను రానురా. బలవంతం చెయ్యకు." అనహాయంగా అన్నాడు.

హమీద్‌కు ఈసారి నిజంగానే ఒళ్ళు మండింది. "ఛస్, ఎప్పుడూ ఇంతేనీవు! ఎక్కడికీ రావు! ఎప్పుడు చూసినా ఈ నాలుగు గోడల మధ్య కూర్చుని ఏడుస్తూ ఉంటావు, ఈసురోమని. ఒరేయ్ రవీ, నా బాబువు కదూ. బంగారుకొండవి కదూ. రారా."

రవి రికార్డు మూసివేస్తూ. "హమీద్, నీకు తెలియనిదేముంది? నన్ను ఊరికే బలవంతం చెయ్యకురా. నా మానాన నన్ను వదిలెయ్" అని మంచం మీద పడుకోటానికి ఉపక్రమించాడు.

"ఎవ్వడ్రా వీడు! ఒక ఆటా లేదు పాటా లేదు. ఉత్త అడవి మనిషి. ఎప్పుడూ ముచ్చులాగ ఏడుస్తూ, ఏడుపు మొహం వీడూను." కసిగా తిట్టుకున్నాడు హమీద్.

• • •

రవి, హమీద్ బి. ఎస్‌సి. విద్యార్థులు. అంతేకాదు; విచిత్రమైన ప్రాణస్నేహితులు కూడా. హమీద్ సన్నిహితులకు ఈ విషయంలో చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఇద్దరూ స్వాభావికంగా ఉత్తర దక్షిణ ధ్రువాలలా విరుద్ధంగా ఉంటారు. వాళ్ళ స్నేహంకూడా కాకతాళీయంగానే జరిగింది. అది రవి అదృష్టమో లేక హమీద్ దురదృష్టమో తెలియదు. కాని, ఇద్దరూ ఒకే లాడ్జిలో, ఒకే గదిలో స్థిరపడ్డారు.

హమీద్ జల్సాకుర్రాడు. చురుగ్గా, చలాకీగా మాట్లాడతాడు. బాగా డబ్బు ఉన్నవాడు. ఆటల్లోను, చదువుల్లోను ఫస్ట్. కాలేజీలో లెక్చరర్ల దగ్గరనుంచి, పి. యు. సి. కుర్రాళ్ళవరకు అందరికి చిరపరిచితుడు. ఎప్పుడూ నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ గలగలపారే సెలయేరులా హుషారుగా ఉంటాడు ఎప్పుడూ. ఇక రవి, హమీద్‌కు పూర్తిగా విరుద్ధం. ఎప్పుడూ నవ్వడు. అదయినా ఎప్పుడైనా జాలిగా, వెర్రిగా నవ్వుతాడు. ఉదాసీనంగా, పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ, ఎల్ల






# శాపఫలం

ప్పుడూ అనంతమైన ఆలోచనల్లో మునిగి తేలుతూ ఉంటాడు. గది, కాలేజి, పుస్తకాలు తప్ప మరో సంగతి పట్టించుకోడు. అతనికి ఇంకేమి అవసరం లేదు. హమీద్‌కు రవితో గట్టి చిక్కే వచ్చి పడేది. హమీద్‌లాంటి చురుకుపాలు ఎక్కువ ఉన్న కుర్రాడికి రవిలాంటి విచిత్ర వ్యక్తి సహచరుడు కావటం మహాద్భుతమే. కాని, హమీద్ ఎంత హుషారు, చలాకీతనం కలవాడో అంత ఓర్పు, సహనం కల మంచి మనస్సు కలవాడు. ఒక్కోసారి రవి ప్రవర్తనతో విసుగెత్తిపోయిన హమీద్ చిరాకుతో, విసుగుతో మండిపడి పోయేవాడు. వెంటనే గది మార్చేసి రవికి దూరంగా పోదామని అనుకొనేవాడు. కాని, అంతలోనే రవి అంటే అంతులేని సానుభూతి, జాలి కలిగేవి. పాపం, తనేలేకపోతే రవి చాలా బాధపడిపోతాడు. "అన్నం తిన్నావా, రవీ?" అని అడిగేవాళ్ళు కూడా ఉండరు అతనికి. ఎంత ప్రాణసమానంగా చూసినా తనవద్ద కూడా అతనికి మొహమాటం. ఒక్కోసారి రవి మొహమాటానికి హమీద్‌కు నవ్వాలో ఏడవాలో తెలిసేది కాదు. ఎన్నో విషయాల్లో రవిని ఆప్తుడుగా, ఆత్మీయుడుగా ఆదుకొనేవాడు హమీద్. రవి బీదవాడు. స్కాలర్‌షిప్పులతో చదువుకొంటున్నాడు. ఆరోగ్యంకూడా అంతంత మాత్రంగానే ఉండేది. తరుచు గుండెనొప్పితో బాధపడేవాడు. అంత చిన్నవయస్సులో రవి ఆ జబ్బుతో బాధపడడం హమీద్ చూడలేకపోయే.వాడు. ఆ సమయాల్లో అతన్ని ఆప్తుని కన్న ఎక్కువగా ఆదుకొనేవాడు. రవి వద్దంటున్నా వినకుండా పుస్తకాలకు, అవసరమయిన ఖర్చులకు డబ్బు సాయం చేస్తుండేవాడు హమీద్. తన కుటుంబ విషయాలను గురించి, తనను గురించి అరమరిక లేకుండా చెబుతూండేవాడు రవికి. కాని, రవి నోరు విప్పి తనను గురించి ఒక్క ముక్క చెప్పేవాడు కాదు హమీద్‌కు. అతడు ఒక్క సంగతి మాత్రం గ్రహించాడు. రవి మనస్సులో ఏదో బాధతోను, మోయలేని బరువుతోను కుమిలిపోతున్నాడన్నదే ఆ విషయం. ఒక్కోసారి హమీద్ రవిని నిలదీసి అడిగేవాడు. కాని, రవి మాత్రం నిండుకుండ. నవ్వి ఊరుకొనేవాడు నిర్వికారంగా. రవి చుట్టూరా హమీద్ ప్రేమ, స్నేహం, జాలి, సానుభూతి వలయంగా అల్లుకుపోయాయి. ఆ బంధాలను తెంచుకొని రవినుండి దూరం కావడానికి హమీద్ మనస్సు ప్రతిఘటించేది. అందుకనే రెండేళ్ళుగా చిత్రమైన స్నేహితులుగా ఒకే గదిలో ఉంటున్నారు రవి, హమీద్.

• •

కాలేజీలో మాచ్ ముగిసిన తరవాత హమీ[illegible] స్నేహితులంతా ఆకాశానికి ఎత్తేశారు. ఆ దినం హమీద్ బ్రహ్మాండంగా ఆడి తన [illegible] విజయం చేకూర్చాడు. స్నేహి[illegible] హోటల్‌కు లాక్కుపోయారు. [illegible] నవ్వుల కేరింతాల మధ్య హమీద్ మరీ చిన్నపిల్లవాడయిపోయాడు. అక్కణ్ణుంచి సినిమాకు పోయారు వాళ్ళు. సినిమా అయ్యాక సినిమాలోని రొమాన్సుకు, హాస్యానికి ఛలోక్తులు విసురుతూ, విమర్శిస్తూ, అనుకరిస్తూ, నవ్వుతూ, తుళ్ళుతూ బయలుదేరారు. హమీద్ [illegible] అతనికి గుడ్‌నైట్

**ఎప్పుడూ ఏదో ఒక కీడు శంకిస్తూనే ఉంటారు కొందరు. వారి జీవితాలు ఏ విధంగా సాగినా వారి మనస్తత్వంలో మాత్రం రవంత మార్పు రాదు. చాలావరకు వారి అనుమానాలు కూడా నిజం అవుతూనే ఉంటాయి.**

చెపుతూ, "వెళ్ళరా. నీ రూమ్మేట్ ఎదురు చూస్తుంటాడు నీ అర్ధాంగిలా" అన్నారు ఒకరు. మిగతావాళ్ళు ఫెఃల్లుమన్నారు నవ్వులతో.

అప్పుడుకాని రవి గుర్తుకు రాలేదు హమీద్‌కు. నవ్వుకుంటూ లోపలికి వెళ్ళాడు. తలుపు తోసుకుని నెమ్మదిగా గదిలోకి వెళ్ళి లైటువేసి నిశ్చేష్టుడయ్యాడు హమీద్. మంచం మీద రవి బాధతో మెలికలు తిరిగిపోతూ మూలుగుతున్నాడు. అంతవరకూ రవి మీద ఉన్న కోపం అంతా పోయి ఆ స్థలంలో అతని మీద జాలీ, సానుభూతీ ఆక్రమించుకున్నాయి హమీద్ హృదయంలో.

మనస్సులో తనను తాను దూషించుకుంటూ, "రవీ! ఎప్పటినుంచిరా, నొప్పి?" అని పరితాపంగా అడిగాడు. రవి కళ్ళు విప్పి బాధగా హమీద్‌వంక చూసి మూలిగాడు.

"మధ్యా... హ్నం ... నుంచీ వస్తూం ... ది ... రా. టేబ్‌లెట్స్ వేసుకున్నా. అయినా తగ్గలే."

"ఈ విషయం నా కెందుకు చెప్పలేదురా, రవీ? నీకంటే నాకు తక్కినవేమీ ఎక్కువకావు. నన్నింత అపార్థం చేసుకున్నావా?" నెమ్మదిగా రవి వీపు మీద మందు రుద్దసాగాడు హమీద్.

అంతకంతకు రవి నొప్పి ఎక్కువ కాసాగింది. కాస్సేపటికి అపస్మారకంగా పడిపోయాడు. హమీద్ చాలా కలవరపడిపోయాడు. వెంటనే హాస్పిటల్‌లో చేర్చాడు రవిని. డాక్టర్లు కేసు చాలా ప్రమాదంగా ఉందన్నారు. హమీద్ ఒకటే మథనపడిపోయాడు రవిని గురించి. తెల్లవార్లూ రవి మంచాన్ని అంటిపెట్టుకుని కూర్చుండిపోయాడు.

మరునాటికి రవి నొప్పి తగ్గింది. బాగా తెలివిలోకి వచ్చాడు. హమీద్ హృదయాందోళన తగ్గింది. హుషారుగా కాలేజికి వెళ్ళాడు.

• • •

బెడ్‌మీద పడుకొని రవి ఆలోచిస్తున్నాడు. అతని హృదయం నిండా హమీద్ నిలిచి ఉన్నట్లుగా ఉంది. తనలో ఏదో అధైర్యం. తనకు చావు దగ్గరలో ఉందని ఎవరో చెబుతున్నట్లుగా ఉంది. కాని, తను మొయ్యలేని విధ్యుక్తధర్మం ఒకటి ఉంది. అది నెరవేరకుండా తను చనిపోతే? రవి ఆలోచనలు హమీద్ మీదికి పోయాయి. ఈ రెండేళ్ళలోను హమీద్ తనకు అత్యంత సన్నిహితుడయ్యాడు. అతని స్నేహమాధుర్యం తన హృదయాన్ని అమృతమయం చేసింది. తా నెప్పుడు ఆశించని, ఆశించలేని ఆత్మీయతను, అనురాగాన్ని హమీద్ సాహచర్యంలో పొందగలిగాడు. అందుకు రవి కెంతో ఆనందంగా ఉంది. సృష్టిలో మధురమైనది స్నేహం. ఆ స్నేహ మాధుర్యాన్ని గురించి చదివినా, విన్నా రవి మనస్సు స్పందించేది. తనకూ అటువంటిది లభ్యం కాకూడదూ? ఎంత పిచ్చి ఆలోచన! ఆ స్నేహ మాధుర్యం కోసం రవి హృదయం అర్రులు చాచేది. కాని, ఇన్నాళ్ళకు అతని తపస్సు ఫలించింది. అతని ఆశ నెరవేరింది. తన జీవిత పథంలో తన విధ్యుక్త ధర్మానికి హమీద్ బాసటగా నిలబడ్డట్టు అనిపించింది. రవి మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కింది. కళ్ళలో ఆనందబాష్పాలు కమ్ముకున్నాయి. ఆ కన్నీటి పొరల మధ్య తన ముందు హమీద్ నవ్వుతూ నిలబడి ఉండటం చూశాడు మసకగా. రెప్పలు విదిలించి చిన్నగా నవ్వాడు రవి.

"రవీ! ఎలా ఉంది ఒంట్లో?" ఆదుర్దాగా రవి పక్కగా కూర్చొని అడిగాడు హమీద్. అతని మాటల్లో ఆర్ద్రత వ్యక్తమవుతూంది.

"కులాసాగా ఉంది, హమీద్. నీకు చాలా ఇబ్బంది కలిగించాను కదూ?"

"ఊఁ. చాలా గొప్ప ఇబ్బందే! కాని, పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తూ మనస్సులో కుమిలిపోతూ ఆరోగ్యం మరికే పాడుచేసుకోకురా! ఆఁ చూడు, రవీ! మీవాళ్ళకు తెలియబరుస్తాను. ఎడ్రస్ చెబుతావా?"

రవి పేలవంగా నవ్వాడు ఆ మాటలకు.

"నా కెవరూ లేరు, హమీద్, తెలియబరచడానికి. ఒకవిధంగా నే నీ లోకంలో ఒంటరివాణ్ణి. నన్ను అర్థం చేసుకొనే ఆత్మీయులు— నన్ను గురించి ఆలోచించే— నా స్వంతం అనేవాళ్ళు నా కెవ్వరూ లేరు." రవి గాఢంగా నిట్టూర్చాడు.

"అలా అనుకొని బాధపడకు, రవీ! నీకు అయినవాళ్ళు లేకపోవచ్చుకాని ఆత్మీయులు లేరంటే నాకు ఎంతేనా కోపం వస్తుంది."

రవి హమీద్‌వంక సాభిప్రాయంగా చూశాడు.

"ఆ విషయం నాకు తెలుసు. నేను గ్రహించాను. నీ స్నేహమాధుర్యం, నా మీద నీకుకల మమతానురాగాలు నాకు తెలుసు, హమీద్. అందుకు నీకు సర్వదా కృతజ్ఞణ్ణి. అందుకే నేను నిర్వర్తించవలసిన ఒక విధ్యుక్త ధర్మాన్ని నీ కప్పగించాలని ఈ సదవకాశానికి అమూల్యమైన క్షణంకోసం ఎన్ని దినాలు నిరీక్షించానో!" ఆయాసపడుతూ రవి కళ్ళు మూసుకున్నాడు.

"రవీ! కాస్సేపు మాట్లాడక పడుకోరా. నీకు మనో విశ్రాంతి కావాలి."

"విశ్రాంతి!" పిచ్చిగా నవ్వాడు రవి.

"ఇక నా కెప్పుడూ విశ్రాంతే, హమీద్. నా జీవితంలో నేను పొందగలిగిన ఈ అమూల్యమైన క్షణాల్ని నన్ను వినియోగించుకోనియ్యి. ఇక ఈ తరుణం మళ్ళా రమ్మంటే రాదు నాకు. నన్నంతా చెప్పనియ్యి." కాస్సేపు ఊపిరి పీల్చుకున్నాడు రవి.

"హమీద్, నాతో నీకు పరిచయం కాగానే నీవు అనుకొని ఉంటావు, 'నే నొక వింత మనిషి' అని. నా సాహచర్యంలో నీకు చాలా సారులు నా మీద విసుగు, చిరాకు, జుగుప్స కలిగించి ఉంటాను. నాకు తెలుసు. నా ప్రవర్తన నాకు తెలుసు.

**బి. ప్రేమలీల**



## శ్రీమతి మూంగీ బాయి గోయెంకా మృతి

ఎక్స్‌ప్రెస్ పత్రికల అధిపతి శ్రీ రామనాథ్ గోయెంకా సతీమణి శ్రీమతి మూంగీబాయి గోయెంకా 1966 మే 21 వ తేది సాయంకాలం 5—30 గంటలకు మద్రాసులో ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్‌లోని స్వగృహంలో మృతి చెందారని ప్రకటించడానికి చింతిస్తున్నాము. శ్రీమతి మూంగీబాయి వయసు 61 సంవత్సరాలు. ఆమెకు ఏకైక కుమారుడు శ్రీ భగవాన్‌దాస్ గోయెంకా, ఇద్దరు కుమార్తెలు, మనుమలు ఉన్నారు.

శ్రీమతి మూంగీబాయి చాలా కాలంగా అస్వస్థులుగా ఉన్నారు. శ్రీమతి మూంగీబాయి ఆదర్శ హిందూ గృహిణి. ధర్మబుద్ధి కలవారు. మూంగీబాయి గోయెంకా బాలికల ఉన్నత పాఠశాల స్థాపించారు. ఆధ్యాత్మిక చింతనతో ఆమె జీవితమంతా గడిపారు.

మే 23 వ తేది సోమవారం అపరాహ్ణం ఎక్స్‌ప్రెస్ పత్రికల సిబ్బంది సమావేశమై, శ్రీమతి మూంగీబాయి మృతికి సంతాపం వెలిబుచ్చుతూ, శ్రీ గోయెంకా కుటుంబానికి తమ సానుభూతి తెలియజేస్తూ తీర్మానం చేశారు.

"ఈ జీవన ప్రపంచం విచిత్రమైనది, హమీద్. ఒక జీవిని ఉద్ధరిస్తే ఆ పుణ్యం పది తరాలు నిలుస్తుంది. మరో జీవిని నాశనం చేసి ఆ ఆత్మను క్షోభపెడితే ఆ శాప ఫలం పది తరాలు తగులుతుంది.ఇది నీకు చిత్రంగా, కల్పనగా ఉంటుంది. కాని, ఇది నిత్య సత్యం సుమా! ఈ సత్యమనే మాట మన జీవితాలకు అన్వయించు కుంటే మన జీవితాలు కల్పన కంటే విచిత్రమయినవని అనిపిస్తుంది. అందుకే ఆ కల్పనలోని శాప ఫలం అనుభ విస్తూ ప్రకృతి విధించిన ఈ భయంకర శిక్షలను మోస్తున్నాను. ఈ ఆవేదనలతోను, కళంకాలతోను, మాయని మచ్చలతోను ఈ జీవితంలో ఏమీ పొందలేక పోయాను. కాని, కాని...ఇన్నాళ్ళకు, ఇన్నాళ్ళకు నా అదృష్టం పండింది. నాకు తెలుసు — మృత్యువు నాకు అతి సమీపంలో ఉందని. అందుకే నా జీవితం ముగిసిపోకముందు, నీలాంటి సహృదయుని కొరకు ఎన్నో విధాల ఈ ప్రపంచంలో అన్వేషించాను, నా విధ్యుక్త ధర్మం నెరవేర్చడానికి.

# జీవితసాగర యాత్ర

## మహేష్

**జీవిత** సాగరంలో
జ్ఞాపకాల పడవలపై
గతానికి పయనిస్తున్నాను.
జీవన జలనిధిలో
వర్తమాన స్వేచ్ఛాకృషి ఫలిత మీనాలు
పరిస్థితుల వల్లెకారులు వేసిన
వలల్లో చిక్కుకుంటున్నాయి.
మీనుల కెక్కడ మార్గంలేదు
కాని వలలు ఛేదించే యత్నం మాత్రం
ఆగి పోలేదు
మనికి పెను కడలిలో
అనుభవాల అలలపై
సుందర భవిష్యద్భవనం రూ
పొందించాలని చూస్తున్నాను.
తరగలపై పునాదులు పడడం లేదుకాని
భవనంపై ఆశ వీగిపోలేదు
జీవిత సముద్రంలో
జ్ఞాపకాల పడవలపై నిరంతరం
పురాతన గతానికి ప్రయాణిస్తునాను. *

"జాగ్రత్తగా విను, హమీద్. నిన్ను నిర్బంధించి బలవంతం చేస్తున్నానని అపోహపడకు. నిన్ను ప్రార్థిస్తున్నాను. అంతకంటె బతిమాలుకుంటున్నాను. హమీద్,నీవు నాకో వాగ్దానం చెయ్యాలి.నీ కిష్టమయితేనే సమ్మతించు. హాయిగా ఈ లోకంనుంచి వెళ్ళిపోతాను. లేదా, ఏమో, నేను చెప్పలేను." రవి చేతులతో మొహం కప్పుకున్నాడు.

హమీద్ భయ సంకోచాలతో రవి వంక చూసి, "ఏమిటో చెప్పు, రవీ! నా శాయశక్తులా ఆ వాగ్దానం నిలుపుకోగలిగే సమర్థుణ్ణి అయితే ప్రయత్నిస్తాను" అన్నాడు.

ఎవరినో గుర్తుకు తెచ్చుకున్నట్టుగా రవి పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది. అంతలోనే అతని మొహం వివర్ణమయిపోయింది.

"నేను బతికి బయట పడడం కల్ల. కాని, నా జీవితంతో ఇంకొక అమాయకురాలి జీవితం ముడిపడి ఉంది. ఆమె నా ప్రాణంలో ప్రాణంగా పదహారు సంవత్సరాలు పెరిగింది. *నా వావుతో ఆమె జీవితం నాశనం కావడం* తథ్యం. కాని...కాని...హమీద్! అలా ఎప్పటికీ కారాదు. అలా కాకూడదు. నా చెల్లెలు పదికాలాలపాటు నవ్వుతూ, హాయిగా పచ్చగా ఉండాలని నా కోరిక. నా మూలంగా ఆ అమాయకురాలి జీవితం నాశనం కారాదు. అందుకని... అందుకని...నీవు నాలా ఆమె జీవితంలో ప్రవేశించగలవా? రవి అన్నయ్య చనిపోలేదని ఆమెకు తెలియకుండా నటించగలవా!" భావోద్వేగంతో రవి అంటున్నాడు.

పిడుగులాంటి ఆ మాటలకు హమీద్ విస్తుపోయాడు, అయోమయంగా రవివంక చూస్తూ, "నీ మాటలు నా కర్థం కావడంలేదు, రవీ!" అన్నాడు.

రవి చేతులు జోడించి, "నా చెల్లెని కాపాడి ఈ దౌర్భాగ్యుని మీద దయ చూపమంటున్నాను" అన్నాడు వణికే గొంతుకతో.

"ఏమిటి నీ ఉద్దేశం, రవీ! జ్ఞానం, వయస్సు కల పద హారు సంవత్సరాల అమ్మాయి దగ్గరికి వెళ్ళి నేను నీ రవి అన్నయ్యనంటే నమ్ముతుందా? ఏమి టీ మాటలు!" ఆవేశంగా అన్నాడు హమీద్.

రవి చిన్నగా నవ్వి, "సులభంగా నమ్మించగలవు, హమీద్. నా చెల్లెలు సుమరాణి పుట్టుగుడ్డి" అన్నాడు.

హమీద్ అదిరిపోయాడు. ఆశ్చర్యంగా, ఆవేదనతో రవి వంక చూశాడు.

"వద్దు, రవీ! అలా చెయ్యడం మంచిది కాదు. ఒక అమాయక హృదయంతో ఆట లాడటం నేనూ ఒప్పుకోను. అశుభమేమీ జరగకూడదు. ఒకవేళ జరిగితే, వాస్తవాన్ని ఆమెకు చెప్పడం మంచిది." మృదువుగా మందలించాడు రవిని.

"వాస్తవం చెప్పి ఆమె హృదయాన్ని వెయ్యి ముక్కలు చేసి ఆమె జీవితాన్ని నాశనం చెయ్యడంకన్నా, ఆ సుమ హృదయాన్ని మభ్యపెట్టి ఆమె జీవితాన్ని ఆనందమయం చెయ్యడం ఎంత త్యాగమో ఆలోచించు, హమీద్. ఒక్క సంగతి మాత్రం నిజం. నిన్ను నేను నిర్బంధించడంలేదు. నీ కిష్టమైతేనే నాకు వాగ్దానం చెయ్యి. శాంతంగా వెళ్ళిపోతాను. లేదా నాలాగే నా సుమ కూడా దిక్కులేని చావు చస్తుంది."

హమీద్ నిర్జీవంగా అలాగే కూర్చుండిపోయాడు. అతని తల దిమ్మెరపోయింది. తెలియరాని వేదనతో గుండె దడదడలాడింది.

"ఏమైనా సుమను నేను మోసగించలేను. ఆ అమాయకురాలిని మోసగించి, ఆ పాపాగ్నితో నా గుండె కాల్చుకోలేను, రవీ. నన్ను క్షమించు." భయంగా అన్నాడు.


## ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులు కండి. స్త్రీ, పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి లేదు. వివరములు ఉచితం.

**TOTAL HEALTH**
**Azad Market (A.P.V.)**
**Delhi-6.**

**ఉచిత బహుమతి: 3 నెలలు మాత్రమే**



స్త్రీలకు సొగసుకు సమకూర్చు కాశ్మీర్ ఆర్టు చీరెలు, నూతనమైన ఆకర్షణీయమైన ఫేషన్ డిజైన్లు, రంగులలో ఇప్పుడే వచ్చియున్నవి. స్టాకు పరిమితము — పెద్ద సైజులో మాత్రమే దొరకును. చీర 1కి రు.10/-లు, 2కి రు. 18/-, 3కి రు. 25/-, 4కి రు. 32/-. రెండుగాని అంతకు మించిగాని చీరలకు ఆర్డరు పంపినవారికి సెల్కు నెక్టై లేక బ్లౌజు గుడ్డ ఉచితం. ఆర్డర్లు పోస్టు పార్సిల్ ద్వారా పంపబడును.

**ARVIND AGENCIES (WAP-55)**
**Box 1408, Delhi-6.**




## గౌర్ మోహన్ దాస్ అండ్ కం.,
**233, పాత చైనాబజార్ వీధి,**
**కలకత్తా—1**
ఫోన్: 22—6580

"దీనిలో మోసమేమీ లేదు, హమీద్. కొన్ని దినాలుగా దీర్ఘంగా ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను. ఇంతకాలం సుమ నా కళ్లనే తన కళ్లుగా భావించి ఈ లోకంలో జీవించింది. ఈ లోకాన్ని చూసింది. ఎన్నో గ్రంథాలు చదివింది. ఒకసారి షాజహాను ముంతాజ్‌ల ప్రేమ కావ్యాన్ని చదివి వినిపించాను. అంతా విని అడగరాని కోరిక కోరింది—'అన్నయ్యా! ఆ పవిత్ర ప్రేమ మందిరం చలవరాతి గోడల నునుపుమీద నా చేతులతో రాస్తూ ఆ నునుపులోని పవిత్రత గ్రహించుకోనియ్యవా?' అని. ఎంత బలీయమైన కోరిక అది! కాని, హమీద్, అప్పుడు నేను ఆర్థికంగా చాలా బాధ పడుతున్నాను. నా సుమను తాజ్‌వంకు తీసుకువెళ్లే స్తోమతు నాకు లేదు. అందుకని, గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నా సుమను, నన్నే సర్వస్వమని నమ్ముకొన్న సుమను సులభంగా వంచించాను. మన్నటి గోడమీద చేతులుంచి, 'ఇదేనమ్మా తాజ్!' అన్నాను. సుమ ఆ గోడలమీద చేతితో తడుముతూ ఎంతో సంబరపడింది. తృప్తితో నిండిన ఆమె పెదవులపై చిరునవ్వు నా హృదయాన్ని తూట్లు తూట్లుగా చేసివేసింది. నే నింత అసమర్థుడనయినందుకు కుమిలి కుమిలి ఏడ్చాను. ఇదేకాదు. ఇలా ఎన్నిసార్లో అనేక విషయాల్లో..."

"లేదు, రవీ, అది వంచన కాదు. నీ ఆర్థిక దుస్థితి వల్ల అది వంచనగా పరిణమించదు. అది మామూలు తెల్లటి గోడ కావచ్చు. కాని, ఆనాడామె ఆత్మీయంగా సజీవమైన తాజ్‌ను తన హృదయంలో చూసింది. ఇది ఎప్పటికీ వంచనకాదు. కాని, నీవు నాకు అప్పగించే బాధ్యతలో మాత్రం అది పచ్చిమోసం—"

"పోనీ, హమీద్, ఇది కాదంటావా? సరే, ఇన్నాళ్లు నా కళ్లనే తన కళ్లుగా భావించి ఈ లోకంలో జీవించగలిగింది. ఆత్మీయమైన ఆమె రెండు నేత్రాలను నే నీనాడు గుడ్డి చేస్తున్నాను. ఇంతకంటె వంచన ఉందా, చెప్పు? నేను చేసిన ఆ వంచనలకే ఆమె దృష్టిలో అసమర్థుణ్ణి. కాని, నీవు అంగీకరిస్తే సుమ ఒక నిజమైన సోదరుణ్ణి పొందగలుగుతుంది. అది ఆమె అదృష్టం. తరవాత నీ ఇష్టం."

హమీద్‌కు గుండెల్లో దేవినట్లయింది. దీర్ఘంగా నిట్టూర్చాడు. రవివైపు చూశాడు. రవి ఆత్రతగా తనవంకే చూస్తున్నాడు. అతని కళ్లలో ఆత్రత, ఆవేదన, తపన కట్టలు తెంచుకున్నట్లుగా ఉంది.

"పోనీ! అలానే అనుకో. కాని నేనామె కళ్లనైతే మోసగించగలవనేమో కాని నా కంఠస్వరం, నా స్పర్శ సుమను ఎలా మోసగించగలవు, రవీ? ఇది సాధ్యమా?" అసహాయంగా అన్నాడు హమీద్.

"లేదు. నా కా భయం లేదు. నీలో తప్పక సుమ నన్ను చూస్తుంది, హమీద్. నన్ను చూస్తుంది. ఏమంటావు? నే నిది ఆశించవచ్చునా?" రవి హమీద్ వంక దీనంగా చెమ్మగిలిన నేత్రాలతో చూశాడు.

హమీద్ క్షణం ఆలోచించాడు. అవును. రవికి ఇప్పుడు వాగ్దానం ఇయ్యాలి. తనకు ఆలోచించుకోడానికి వ్యవధి లేదు. అసహాయుడైన స్నేహితుడికోసం ఈ త్యాగం చేసి, అతనికి తృప్తి కలిగించి, తరవాత ఆలోచించవచ్చుననే నిర్ణయంతో హమీద్ హృదయం తేలికపడింది.






ఎంబ్రోసియా
వారి
డ్రింకోల్
పలు రకముల
పళ్ళరసములతో
తయారుచేయబడినది
ఎంబ్రోసియా
క్యానింగ్ ఎంటర్ ప్రైసెస్,
పోష్టుబాక్స్ నెం. 543, విజయవాడ-3

ఉచితము! ఉచితము!!
తెల్లమచ్చలు
మా ప్రఖ్యాతి వహించిన 'డాగ్ సాఫా' ప్రత్యేక ఔషధము తెల్ల మచ్చలను సులభముగా పోగొట్టుటలో 1924 వం॥ నుండి ప్రఖ్యాతి వహించి యున్నది. మూడురోజులు వాడినంతనే మచ్చల తెలుపుదనం ఆపైన కొన్నిరోజులలోనే పూర్తిగా బాగుచేయు శక్తికలదు. ఉచితంగా ఒక పాకెట్ మందు ఇవ్వబడును. నకలును చూచి మోసపోకండి.
Sri Krishna Chandra Vaidya
(A.P.) P.O. Katri Sarai (Gaya)




# శాపఫలం

రవి చేతిని రెండు చేతులతో పట్టుకొని, "అలానే సుమను నా చెల్లెలుగా చూసుకొంటాను, రవీ. నాహృదయంలో నుండి వస్తున్న దీ వాగ్దానం" అన్నాడు. రవి కళ్లంట ఆనందబాష్పాలు జలజలా రాలాయి. హమీద్‌ను ఆలింగనం చేసుకొని మనస్సులోని ఆనందాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేశాడు. తన గుండెలమీద వాలిపోయి ఉన్న రవిని నెమ్మదిగా పరుపుమీద పడుకోబెట్టాడు హమీద్.

అతనివంక తదేకంగా చూడసాగాడు రవి. "ఇక వ్యవధిలేదు, హమీద్. మా గురించి నీకంతా చెపుతాను. మా జీవితాలను చూస్తుంటే నీకు ఆశ్చర్యంగా ఉంది కదూ? ఉన్న ఇద్దరిలోను గుండె జబ్బుతో మృత్యువుతో పోరాడుతున్నది ఒకరు. మరొకరు ఈ ప్రపంచాన్ని చూడడానికి నోచుకోని పుట్టంధురాలు. నిజంగా నాకు అనిపిస్తుంటుంది—ప్రకృతి విధించిన ఈ శిక్షలకు మూలం కొన్ని వర్ణించలేని దుష్కార్యాలని. బుద్ధి వికాస వైవిధ్యాలలో భిన్నవిభిన్నమైన పనులవల్ల, దుష్కార్యాలవల్ల పొందే అనుభవాలకు, కలిగే ఫలితాలకు ప్రతిబింబాలం మేము. బుద్ధి గతి తప్పి మాసిన అంచు మానవుడి మెదడుకు అనించి, మృత్యు సమీపానికి నెట్టివేస్తుంది. అందుకే ఆజన్మాంతము ఈ శాపాల్ని అనుభవించమని, ఏ దుర్మార్గుడి రక్తంతో జన్మించామో ఆ దుర్మార్గుడి అడుగుజాడలలో నడవకుండా ఉండడానికి కాబోలు, ప్రకృతి మమ్మల్ని ఈ విధంగా ఘోరంగా శిక్షించింది. ఆ కఠిన హృదయుడు కావించిన రాక్షస కృత్యాలవల్ల ఎన్ని భగ్న హృదయాలు తమ అశ్రువాహినిలో మమ్మల్ని శపించాయో తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఎన్నో అమాయిక హృదయాలు ఆ పాపాత్ముడి దారుణకృత్యాలకు పువ్వుల్లోని రేకులుగా రాలిపోయాయి. అవధులులేని వారి దుఃఖానికి మేము సాక్షులం...అబ్బా!" ఆయాసంగా మూలిగాడు రవి.

అతని నుదుటిమీద తేరిన చెమట బిందువుల్ని తువ్వాలుతో ఒత్తుతూ, "రవీ! మరోసారి చెపుదువు కాని, కాస్సేపు పడుకోరా. చాలా బలహీనంగా ఉన్నావు. ఏమైనా తాగుతావా?" అన్నాడు హమీద్.

"అవును, హమీద్, నాకు చెప్పడానికి శక్తి లేదు. శక్తిహీనుణ్ణి. అసమర్థుణ్ణి." అసహాయంగా దిండులో తలదూర్చి నిట్టూర్చాడు రవి. హమీద్ అతి మన్నితంగా రవి తల తన వంక తిప్పుకొని పాలు కొద్ది కొద్దిగా తాగించాడు.

రవి హమీద్‌వంక తదేకంగా చూడసాగాడు.

"హమీద్, నీవు నామిత్రుడవు. నీలాంటి మిత్రుణ్ని ఈ ప్రపంచంలో పొందగల అదృష్టవంతులెందరున్నారో నేనెరగను. అలాంటి నీస్నేహమాధుర్యాన్ని నాస్వార్థానికి ఉపయోగించుకుంటున్న మూర్ఖుణ్ని. నన్ను క్షమించరా." రుద్ధకంఠంతో అన్నాడు.

"ఊరుకో, రవీ. అలా బాధపడితే నీ ఆరోగ్యం మరింత దెబ్బతింటుంది. నీకు తప్పక సహాయం చేస్తాను. నన్ను నమ్ము."

టెంపరేచర్ చూడడానికి గదిలోకి వచ్చిన నర్స్ వీళ్లను చూసి మందహాసం చిట్లించింది. హమీద్‌ను ఉద్దేశించి—


చార్మిస్ మీ
ముఖవర్చస్సును
మనోహరముగా
చేస్తుంది!




ఉత్సాహవంతులుకండి... లాలిత్యం పొందండి...
రోజంతా శోభచేకూర్చుకోండి!
మీకు రోజంతా శోభ చేకూర్చుటలో సహాయపడే కొత్త చార్మిస్‌తో చల్లగా, సేదదేరి ఉండండి. కొత్త ఆకర్షణీయమైన డబ్బాలో లభించే చార్మిస్ యొక్క ఆనందప్రదమైన వాసన మిమ్మల్ని సేదదేర్చుటలో ఇంద్రజాలములా పనిచేస్తుంది... మిమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తుంది... మిమ్మల్ని మనోహరముగా కనపడేలా చేస్తుంది
చార్మిస్
టాల్కమ్ పౌడర్ ఆనందప్రదమైన వాసన కలిగి ఉన్నది
CH.TP G. 13 TL

"మిస్టర్! మీ స్నేహితుడు చాలా నీరసంగా ఉన్నాడు. మీరిలా ఆయనకు శ్రమ కలిగిస్తే డాక్టరుగారికి సంజాయిషీ ఇవ్వలేక చావాలి" అని మందలిస్తూ అంది.

"క్షమించండి, సిస్టర్!"

"సిస్టర్! హమీద్ తప్పు కాదు. నేనే చాలా మాట్లాడవలసి వచ్చింది. హమీద్‌నేమీ అనకండి."

సిస్టర్ ఇద్దరివంక చూసి, "బలేమిత్రులే!" అంటూ మందస్మిత తరళవదనంతో వెళ్ళిపోయింది.

* * * *

రాత్రి అంతా రవి చెప్పిన సంగతులే ఆలోచిస్తూ పడుకున్నాడు హమీద్. మరునాడు ఉదయమే హాస్పిటల్‌కు వెళ్ళాడు. నైట్ డ్యూటీ ముగించుకుని వస్తున్న నర్స్ ఎదురుపడింది.

"మిస్టర్! మీరేనా హమీద్? చూడండి. ఐయామ్ వెరీ సారీ. మీ ఫ్రెండ్ తెల్లారి నాలుగింటికి చనిపోయాడు..."

ఆమె మాటలు వింటూ మ్రాన్పడిపోయాడు హమీద్.

"సిస్టర్! రవి...రవి..." కంగారుపడుతూ ఏదో అడగబోయాడు.

"పాపం, చాలా ప్రమాదంగా వచ్చింది నొప్పి. చివరిసారిగా మీ పేరు గొణుగుతూ కళ్ళు మూసేశాడు. మీకు కబురు చేద్దామంటే ఎడ్రస్ తెలియదు. కాని ఇదిగో! అతని దిండుకింద ఈ కవరుంది." పర్సులోంచి కవరు తీసి హమీద్‌కు ఇచ్చింది నర్స్.

వణికే చేతులతో హమీద్ ఆ కవరు అందుకున్నాడు. గజిబిజి అక్షరాలు వంకరటింకరగా కాగితంమీద వ్రాసి ఉన్నాయి.

"హమీద్,

నా కిక కొన్ని నిమిషాల్లో ఏదో జరగబోతూం దనిపిస్తోంది. మరొక్కసారి నీ నోటనుంచి ఆ మాటలు వినాలని...వినాలని, వింటూ చనిపోవాలని ఆశగా ఉందిరా! చనిపోతున్నానని నా కేమీ అధైర్యం, భీతిలేదు. నాలో ఏదో సంతృప్తి! ఆనందం! నా చరిత్ర అంతా నీకు చెప్పుకున్నాను. దాదాజీ నీకంతా చెపుతారు. పరిస్థితులన్నీ దాదాజీకి వ్రాసి ఇందులో ఉంచాను. దాదాజీకి చదివి వినిపించు. హమీద్, చివరిసారిగా వేడుకుంటున్నాను. నా సుమను నీ చేతుల్లో ఉంచుతున్నాను. మరోమాట. నా చితాభస్మాన్ని దాదాజీకి అందజెయ్యి. నీ రవి."

చదవడం ముగించి కళ్ళంట కారుతున్న కన్నీరు తుడుచుకున్నాడు హమీద్. రవి తన మీదనే ఆశలు నిలుపుకొని, తన మాటను నమ్ము చేయుడనే విశ్వాసంతో ఈ లోకం విడిచిపోయాడు. ఈ బాధ్యత తను నిర్వహించగలడా? తనకంత సామర్థ్యం ఉందా? తను ఒక ముస్లిం యువకుడు. సుమ హిందూ బాలిక. తన తల్లిదండ్రులు సనాతన దృక్పథం కలవారు. తను ఆర్థికంగా, సాంఘికంగా, మతరీత్యా బంధితుడు. సుమను తీసుకొని ఈ ప్రపంచంలో ఒంటరిగా తను జీవించగలడా? అలా అని రవికిచ్చిన వాగ్దానాన్ని భంగపరచలేడు. 'భగవాన్! ఈ సమస్య ఎలా పరిష్కరించేది?' ఆలోచనాతరంగాలనుండి తేరుకొని హమీద్ రవి శవం ఉన్న గదివేపు నడిచాడు భారమైన అడుగులతో.

(సశేషం)


# వుడ్‌వార్డ్స్‌తో

## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స్, కుట్టునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లు చేయునపుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!




తెలివైన తల్లులు 100 ఏళ్లకు పైగా వాడుతున్నారు.

LPE Aiyars. F. 10 TL'

# శాపఫలం

బి. ప్రేమలీల

(క్రిందటి సంచిక తరువాయి)

## జరిగిన కథ

రవి, హమీద్ ప్రాణ స్నేహితులు. రవి చనిపోతూ, తన చెల్లెలు సుమను కాపాడే బాధ్యత హమీద్‌కు అప్పగించాడు. దాదాజీని కలుసుకొని తన పరిస్థితి తెలుసుకోమ్మని కూడా కోరాడు.

---

"అమ్మా!"

"ఏమిటి, హమీద్?" ఆప్యాయంగా అడిగింది మనూమా.

తల్లి కేదో చెప్పదామని తచ్చాడుతూ, నసుగుతూ, ఆమె మొహంలోకి క్షణం నిరీక్షిస్తూ హమీద్ నానా అవస్థలు పడుతున్నాడు. ఈ సంఘటన మనూమా రెండు దినాలనుంచి ఎదుర్కొంటూంది. హమీద్ వచ్చిన దగ్గరనుంచి లోలోన ఏదో సంశయంతో సతమత మవుతున్నాడని ఆమె గ్రహించింది.

మనూమా క్షణం హమీద్‌ను వీక్షించింది. ఆమె పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది. వాత్సల్యంతో అడిగింది:

"ఏమిటి, హమీద్, నన్నేమైనా అడుగుతావా?"

హమీద్ తల్లివంక సంకోచంతో చూసి లేచి పోబోయాడు. మనూమా చేయి పట్టుకొని ఆపుచేసి—

"ఏమి టిది, హమీద్, నా దగ్గర నీకు భయం ఎందుకు? నేను నిన్నేమి అనను, నాయనా!" అని ఆప్యాయంగా చిరునవ్వుతో అతని మొహంలోకి చూసింది.

హమీద్ గొంతు నెమ్మదిగా పెగిల్చి, విషయం అంతా సూక్ష్మీకరించాడు.

"అమ్మా! నే నిప్పు డేం చేయాలి? రవి కోరికను వమ్ము చేయమంటావా? లేక అతని కోరికను నెరవేర్చ మంటావా? చెప్పమ్మా." ఆదుర్దాగా చూశాడు.

మనూమా గాఢంగా నిట్టూర్చింది.

గంభీరమైన ఆమె మౌనానికి హమీద్ కలవర పడ్డాడు. సనాతన దృక్పథంలో బంధింపబడ్డ హమీద్‌కు వచ్చిన ఈ సమస్య ఎంత జటిలమైనదో ఆమెకు గ్రాహ్యం కాకపోలేదు. కాని, ఆమె మనస్సు రవి ఎడల, సుమ ఎడల ఏదో తెలియని అనుభూతితో, జాలితో నిండిపోయింది. దానితో ఆమె హృదయం సనాతన దృక్పథం అనే మూఢ నమ్మకాల తెరలను విదుల్చుకో సాగింది.

"హమీద్! నీవేం నిశ్చయం చేసుకున్నావు?"

"నీ అంగీకారం కోసం ఎదురుచూస్తున్నానమ్మా!" తల్లి మాటలు అతి జాగ్రత్తగా వింటున్నాడు హమీద్.

మనూమా తల ఎత్తి హమీద్‌వంక చూసింది. అతని కళ్లలో మిత్రునికిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలనే ఆత్రత, తపన ద్యోతకమవుతున్నాయి.

ప్రేమగా నవ్వి అన్నది ఆవిడ: "వెళ్లి సుమను చూడు, హమీద్. వీలయితే ఇక్కడికి తీసుకురా!"

"అమ్మా!" ఆనందాతిశయంతో సర్వం మరిచి అరిచాడు.

"అమ్మా, నిజంగానా...నిజంగానా, అమ్మా! నాన్నగారు, మన బంధువులు అంగీకరిస్తారా...చెప్పమ్మా..." తల్లి చేతులు ఊపేస్తూ అడిగాడు హమీద్.

"మీ నాన్నగార్ని, అందర్ని ఒప్పించగలిగే ధైర్యం నా కుంది, హమీద్. వెళ్లి సుమను తీసుకురా! రవి ఏనాడైతే సుమ నీ చెల్లెలన్నాడో, ఆ క్షణంనుంచి సుమ నా బిడ్డ." గద్గదకంఠంతో అంది.

"అమ్మా, నీవు...నీవు!..." ఆనందంతో మాట్లాడ లేక తల్లివైపు చూస్తూ ఏడుస్తున్నాడు హమీద్.

"నేనా, నాయనా! నేను ఈ భారతదేశంలో ఒక సామాన్యమైన మాతృమూర్తిని." చెమ్మగిలిన కళ్లు ఒత్తుకుంటూ అన్నది ఆవిడ.

"కాదమ్మా! నీవు దేవతామూర్తివి." తల్లి కాళ్లు కళ్ల కద్దుకుంటూ అన్నాడు హమీద్.

* * * *

తూర్పున తెలతెలవారుతూంది. చీకటి తెరలను చీల్చుకుంటూ లేతభానుని చిరు ఎండ పొగమంచును ఉక్కిరి బిక్కిరి చేస్తూంది. ప్రకృతి బద్ధకంగా, మెల్లి మెల్లిగా కళ్లు విప్పుకుంటూంది. ప్రశాంతంగా ఉన్న ఆ ప్రభాతవేళ సుమ ఒక పాడుపడిన కొలను గట్టున కూర్చొని ఉంది. ప్రభాత సమయంలోని ప్రకృతి సౌందర్యం సుమ కెంతో ఇష్టం. ఆ నిర్మలమైన ప్రకృతిని అవలోకించే అదృష్టం ఆమెకు లేకపోయినా ఏదో తీయని కాంక్షతో, ప్రతి ఉదయం ఆ కొలను గట్టున చల్లని నీడల మాటున కూర్చొని తనూ ప్రకృతిలో లీనమై సర్వం మరిచి పోతూంటుంది. రవి ఉన్న దినాల్లో ఆమెకు ప్రకృతి దేవతనుగూర్చి అతి రమణీయంగా వర్ణించి చెప్పేవాడు. సుమ ఆసక్తితో వింటూ చూస్తున్నట్టుగానే మురిసిపోయేది. సుమ వేసే ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పేవాడు రవి. సుమ, అన్నయ్య కళ్లతో ఈ లోకాన్ని చాలావరకు చూడగలిగేది. అందుకు సుమ కెంతో గర్వం.

అత్యంత ప్రశాంతంగా ఉన్న ఆ దినం, ప్రకృతి పవిత్రతకు, ప్రశాంతతకు అర్థం చెపుతున్నట్లుగా సుమ, వనబాలికలా కూర్చొని ఉంది. ప్రతిదినం ఆమె ఒళ్లంతా కళ్లు చేసుకొని రవి రాకకోసం ఎదురు చూస్తూంది. నిశ్చలమైన తన కనుపాపలతో ప్రకృతిని ఆకళించుకుంది.

అంతా చీకటి! అన్నయ్య వచ్చేవరకు తన కంతా చీకటి! కొలను పక్క పచ్చని బయళ్లమీద మిలమిల లాడుతున్న మంచుబిందువులు మలయ సమీరుని తాకిడికి తట్టుకోలేక భూమాత హృదయంలో తలదాచుకుంటున్నాయి. చుట్టూరా పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలు, అడవి మల్లెలతో చూడడాని కది అంతా చిన్న అడివిలా గుంది. అదంతా సుమరాణికి చిరపరిచితం. ఆ అడివిలో ఏదో విశిష్టత, ప్రత్యేకత. ఆ ప్రత్యేకతలో ఏనాటిదో నందనవన సౌందర్యం కనిపించీ, కనిపిస్తూ చూపరులకు విభ్రాంతిని కలిగిస్తూంది. సుమ అతి చనువుగా ప్రతి చెట్టును చేత్తో తడుముతూ, వాటిని పలకరిస్తూ, చేతుల కంటుకున్న ఆకుల మీది మంచు బిందువుల్ని మొహానికి రాసుకుంటూ ఆనందపడుతూంది.

సరిగ్గా అదే సమయంలో పర్ణశాలలాంటి చిన్న కుటీరం ముందు హమీద్, దాదాజీ కూర్చొని ఉన్నారు. దాదాజీ చేతిలోని చితాభస్మపు పాత్రను గుండెల కద్దుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. సంతత ధారాపాతంగా కన్నీరు రాలుస్తున్న దాదాజీని ఎలా ఓదార్చాలో తెలియక హమీద్ నిశ్శబ్దంగా తనూ కన్నీరు కార్చసాగాడు. దాదాజీ పిచ్చివాడిలా తనలో తనే ఏదో గొణుక్కోసాగాడు.

"దాదాజీ! సుమకొరకు మీరు ధైర్యం తెచ్చుకోవాలి. రవి వ్రాసిన ఉత్తరం విన్నారుగా?"

"అయ్యో! రవీ, నాయనా! ఆ గుండెనొప్పి నిన్నింత త్వరగా తీసుకుపోతుం దనుకోలేదు, బాబూ. ఆ చావు నాకైనా రాలేదేం? చదివింది చాలు. ఇకవద్దు బాబూ. ఇంటిదగ్గిరే ఉండి మంచి మందు ఇప్పించుకోమంటే విన్నావు కాదు. ఇలా దిక్కులేని వాడివిగా వెళ్లిపోయావా? మా కెంత అన్యాయం చేశావా?" దాదాజీ ఒక్కసారి ఘొల్లుమన్నాడు. హమీద్ చేతులు పిసుక్కుంటూ లోలోన మథనపడసాగాడు.

"దాదాజీ! దాదాజీ!" అతి మనోహరమైన, కోమలమైన పిలుపు.

ఏడుస్తున్న దాదాజీ చటుక్కున లేచి, 'సుమ వస్తూంది. ఈ సన్నివేశాన్ని ఎలా ఎదుర్కోను? నా గుండె పగిలిపోతూంది' అనుకున్నాడు.

"ధైర్యం తెచ్చుకోండి, దాదాజీ." గంభీరంగా అంటున్నా హమీద్ హృదయం కూడా దడదడలాడి పోతూంది.

సుమ తడుముకుంటూ వచ్చింది.

సుమను చూసి హమీద్ విభ్రాంతుడయ్యాడు. భగవంతు డెంత నిర్దయుడు! ఈ అమాయకురాలు ఎవరికి అన్యాయం చేసిందని ఈ శిక్ష? హమీద్ ఆంతర్యం బాధతో మూలిగింది.

"దాదాజీ! ఎవరు వచ్చారు?" చిరునవ్వుతో అంది.

హమీద్, దాదాజీ ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు. ఇరువురి హృదయాలు హాహాకారాలు చేయసాగాయి. లోలోన భయకంపితులవుతూ పైకి లేని గాంభీర్యం వహించసాగారు.

"అన్నయ్య! అన్నయ్య వచ్చాడమ్మా!"

"ఆఁ అన్నాయి వచ్చాడా? ఏడీ, అన్నయ్యేడీ? అన్నయ్య ఎక్కడ? నా మీద కోపం వచ్చిందా? నాతో

"పలావ్ చెయ్యాలంటే పదిమందిని అడగాల్సిన పనితప్పింది. ఒక్క పలావ్ మాత్రమే కాదు—నాన్-వెజిటేరియన్ వంటలన్నీ యింతరుచిగా చేసుకోవచ్చని కూడా ఈ పుస్తకం కొన్న తర్వాతనే మాకు తెలిసింది." అని ఎంతోమంది మెచ్చుకుంటున్న కొత్త పుస్తకం!!

**పలావ్, కుర్మా వగైరా వంటకాలు**

రచన : **శ్రీమతి లక్ష్మిప్రసన్నం** :: పరిష్కరణ : **శ్రీమతి మాలతీచందూర్**

వెల : సాదా ప్రతి రు *2–50.* మేలు ప్రతి రు *3–50.* పోస్టేజి అదనం.

మా యితర ప్రచురణలు : మాలతీచందూర్‌గారి వంటలు పిండివంటలు 1వ భాగం రు 3-00; 2వ భాగం రు 2-00: 3వ భాగం రు 3-00; అల్లికలు కుట్లు రు 7-50; అందాలు అలంకారాలు రు 2-50: మరొక కొత్త పుస్తకం—"దేశం కోసం" (మూడు నాటికలు) రచయితలు : పింగళి నాగేంద్రరావు, పాలగుమ్మి పద్మరాజు, కె. జగ్గయ్య. వెల రు *1–00.* పోస్టేజి అదనం.

**కమలా పబ్లికేషన్స్,** చోడవరపు దేవరాజుగారి వీధి (అరండల్ సత్రానికి ఎదురుగా) గవర్నరుపేట, విజయవాడ-2.




# శాపఫలం

మాట్లాడటమే లేదు. 'సుమా!' అని పిలవడేం? ఏడీ, ఎక్కడ?" అంటూ చేతులు చాచి వెదక సాగింది సుమ.

హమీద్ కాళ్ళ దడదడలాడాయి. అతని ఆపాద మస్తకం తెలియని భయంతో కంపించసాగింది. దాదాజీ చేతులతో ముఖాన్ని దాచుకున్నాడు.

సుమ హమీద్‌ను సమీపించింది. తన చేతులతో అతన్ని చుట్టేసింది. కుసుమకోమలమైన ఆమె శరీరం అతన్ని చుట్టుకొని అతని శరీరాన్ని నిలువునా దహించివెయ్యసాగింది. బరువైన నిశ్వాసం తప్ప అతనిలో చలనమే లేదు. రాతిబొమ్మలా సర్వం మరిచి నిలిచిపోయాడు హమీద్. సుమ అతి వాత్సల్యంగా హమీద్ ఒళ్లంతా తడుముతూ, "అన్నయ్యా! ఏమిటి నీవు చాలా మారిపోయావు?" అంది. అపరిచితంగా ఉన్న ఆ శరీరాన్ని మాటిమాటికి తడుముతూ, హమీద్ చెంపల మీద చేతు లుంచి ఒక్క మాటుగా అదిరిపడి, కెవ్వుమంటూ వెనక్కు తూలి పడింది.

అంతవరకు అయోమయ స్థితిలో ఉన్న హమీద్ ముందుకు ఉరికి రెండు చేతులతోటీ సుమను పట్టుకొని, "సుమా" అని పిలిచాడు ఆప్యాయంగా. ఆపిలుపులో విలువ కట్టలేని ప్రేమ, అనురాగం వ్యక్తమవుతున్నాయి.

సుమ తొట్రుపాటుతో లేచి, "ఎవరు నీవు? మా అన్నయ్యవు కావు. నీవు మా అన్నయ్యవు కావు" అని గట్టిగా ఏడుస్తూ అంది.

గుండెలు చిక్కబట్టుకొని, అమిత ధైర్యంతో, "నేను మీ అన్నయ్యనేనమ్మా! ఎందు కలా గాభరా పడుతున్నావు?" అన్నాడు.

"కాదు, మోసం. నన్ను మోసం చేస్తున్నారు. నాలాంటి గుడ్డిదాన్ని ఎందుకు బాబూ మోసం చేస్తున్నారు? నేను మీ కేం అపకారం చేశాను? నాలాంటి అంధురాలితో ఎందు కీ పరిహాసాలు, ఆటలు? చెప్పండి. మీరు మా అన్నయ్య కాదు!" ఉద్వేగంతో అంటూంది సుమ.

ఏడుస్తున్నదల్లా చటుక్కున ఆగి, "తాతయ్యా!" అని గంభీరంగా అంది. అదిరిపాటుతో దాదాజీ కలవర పడిపోయాడు. "తాతయ్యా, నీవు కూడా నన్ను మోసం చేస్తున్నావా?" రోషంగా అంది.

"అమ్మా, సుమా! నన్ను విశ్వసించని స్థితికి వచ్చావా, తల్లీ!" అంటూ దాదాజీ ఘొల్లుమన్నాడు.

"నిన్ను విశ్వసించకపోతే నన్ను నేనే నమ్మలేను, తాతా! అన్నయ్య ఏడీ? చెప్పవా? నాకు తెలుసు. నీవు నన్ను మోసం చెయ్యవు."

దాదాజీ దీర్ఘ నిశ్వాసం విడిచి హమీద్ వంక చూశాడు.

"వాస్తవం చెప్పెయ్య, బాబు. సుమ మనం అనుకున్నంత అమాయకురాలు కాదు." దృఢంగా అన్నాడు.

అంతావిని సుమ చైతన్యరహిత అయి నిర్వి

కారంగా చేష్టలు దక్కి అట్టే కూర్చుండిపోయింది. ఆమెలో నించి ఏ విధమైన హాహాకారాలుకాని, అలజడికాని రాలేదు. అంతా విని ఆమె ఏడిస్తే ఎలా ఓదార్చాలా? అని కలవరపడిన దాదాజీ, హమీద్‌లకు కొత్త సమస్య ఎదురయినది.

దాదాజీ భీతితో సుమను సమీపించి, "తల్లీ, సుమా!" అన్నాడు అశ్రువ్యాకుల కంఠంతో.

సుమ దాదాజీకేసి తిరిగి, "తాతయ్యా!" అంటూ తెలివి తప్పి కింద పడిపోయింది.

● ● ●

దాదాజీ గదిలోనుంచి కన్నీరు తుడుచుకుంటూ బయటికి వచ్చాడు. హమీద్ ఆత్రతగా, "ఎలాగుంది, తాతా, సుమకు?" అన్నాడు.

"ఎంత బతిమిలాడినా వైద్యం వద్దంటూంది, చాలా బలహీనంగా ఉంది. నిన్ను పిలుస్తూంది. బాబూ. దగ్గిర కూర్చో." గద్గద కంఠంతో అన్నాడు దాదాజీ.

"నన్నా? నన్నా? దాదాజీ! నాకు భయంగా ఉంది. సుమ దగ్గిరికి వెళ్లి నిలబడే ధైర్యం నాకు లేదు."

"ఫరవాలేదు. సుమ చివరి ఘడియల్లో ఉంది, నాయనా."

హమీద్ తడబడే అడుగులతో సుమను సమీపించి, "చెల్లీ, సుమా!" అన్నాడు ఆప్యాయంగా.

సుమ హమీద్ చేతిని తన చేతితో నిమురుతూ, "అన్నయ్యా!" అంది. హమీద్‌కు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. అతని మస్తిష్కంలో ఆశాజ్యోతి వెలిగింది.

"సుమా! డాక్టరును తీసుకు వస్తాను."

సుమ విషాదంగా నవ్వింది. "వద్దు, అన్నయ్యా. నామీద నీకేమాత్రపు అభిమానం ఉన్నా, డాక్టరు ప్రసక్తి తేవద్దు. నన్ను శాంతంగా వెళ్లిపోనీండి. అన్నయ్యను వదిలి నేను ఉండలేను. నేను వెళతాను. నన్ను వదిలి అన్నయ్య ఎందుకలా వెళ్లిపోయాడో అడుగుతాను" అంది రుద్ధకంఠంతో.

"సుమా, రవి నీమీద ఎన్ని ఆశలు నిలుపుకొని నిన్ను నాకు అప్పగించాడో నీకు తెలుసు గదూ? రవి కోరిక కాదంటావా? అతని ఆత్మకు అశాంతి కలిగిస్తావా? నా బాధ్యత నిర్వర్తించనియ్యి తల్లీ." బ్రతిమాలుతూ అన్నాడు హమీద్.

సుమ పాలిపోయిన పెదవులపై చిన్న హాసరేఖ మెరిసింది.

"ఈ లోకంలో సుఖ సంతోషాలతో నేనెలా జీవించగల నన్నయ్యా! నేనొక హంతకుని కూతుర్ని. ఈ లోకం నన్ను బతకనీయదు."

"సుమా!" ఆశ్చర్యచకితుడయ్యాడు హమీద్. "అదంతా నీకు తెలుసా? నీకు తెలీదనుకున్నాను."

"అన్నయ్య, దాదాజీ అలానే అనుకున్నారు. నాకు మా చరిత్ర అంతా తెలుసు." నిట్టూర్చింది.

"అయితే మాత్రమేం? నిన్ను పువ్వుల్లో పెట్టుకుంటాను. అమ్మ నిన్ను తీసుకు రమ్మంది. ఏమందో తెలుసా? 'రవి ఏనాడు సుమను నీకు అప్పగించాడో, ఆనాటినుంచీ సుమ నా బిడ్డ నాయనా' అంది." ఉత్సాహంగా చెప్పాడు హమీద్.

"వద్దు, అన్నయ్యా. ఈ లోకం మన బాంధవ్యాన్ని సహించదు. ఇది పాపిష్ఠిలోకం! కుల మత భేదాలనే రాతి గోడలతో మన హృదయాలను సజీవసమాధి చేసివేస్తుంది."

హమీద్ దృఢ నిశ్చయంతో అన్నాడు: "వాటికి మనం అతీతులం అవుదామమ్మా."

"అన్నయ్యా, మనం మానవులం. అతి దుర్బలమైన మనస్సు కలవారం."

హమీద్ దైహికంగా, మానసికంగా బాగా అలిసిపోయాడు. క్షణం మౌనంగా ఉన్నాడు.

"నా మాటలకు కోపం వచ్చిందా, అన్నయ్యా!" జాలిగా అంది. "అన్నయ్యా! నాకు దిక్కు మాలిన చావు రాకూడదని, ఆత్మీయుల చేతులలో చావ అనే కోరిక ఉంది. నీలాంటి సోదరుడి చేతుల్లో చావడం, నా కంతకంటే అదృష్టం ఇంకేముంది? నన్ను వెళ్లిపోనీ! ఈ గుడ్డి చెల్లిని తీసుకొని సంఘపు కట్టుబాట్లను దాటుకొని పైపైకి పోలేవు. అది సాధ్యం కాదు. ఉన్నతమైన నీ భవిష్యత్తు నా మూలంగా నాశనం కావడం నేను సహించలేను. జీవితమంతా ఒకరిమీద ఆధారపడవలసిన నావల్ల నీ భవిష్యత్తు నీ జీవితం, సర్వ నాశనం అవతాయి."

"సుమా, ఏం మాటలమ్మా ఇవి?"

"నాకు చాలా సంతోషంగా ఉంది, లన్నయ్యా! దేవుడు నాకిచ్చిన అన్నయ్య సాన్నిధ్యంలో చచ్చిపోతున్నాను. నాకెంత ఆనందంగా ఉందో తెలుసా? దాదాజీ ఏడి? నాకు కనిపించడేం?" సుమ లోలోన గొణుగుతూ తనలోతనే నవ్వుకోసాగింది.

● ● ● ●

ఆరోజుతో సుమ చనిపోయి మూడు రోజులు గడిచాయి. సన్నని గుడ్డివెన్నెల్లో దాదాజీ, హమీద్ కూర్చుని ఉన్నారు. దాదాజీ ముడతలు పడిన చెంపల మీదుగా కన్నీరు ఆగకుండా ప్రవహిస్తూంది. హమీద్ చెమ్మగిలిన కళ్లతో దాదాజీని చూస్తూ మూగగా కూర్చుండిపోయాడు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"దాదాజీ! రవి నామీద సుమ భారంవేసి, కొండంత ఆశతో వెళ్లిపోయాడు. సుమను సుఖంగా నమ్మించవచ్చునని అనుకున్నాడు. కాని సుమ రవికి తగిన చెల్లెలు. అతని ఎడబాటు సహించలేక రవిని వెతుక్కుంటూ వెళ్లిపోయింది. అంత మంచి చెల్లెలు నాకెలా దక్కుతుంది?" దీర్ఘంగా నిట్టూర్చాడు.

దాదాజీ మాట్లాడలేదు. అలిసిపోయిన అతని నేత్రాలు దూరాన తోటలో తెల్లగా మెరుస్తూన్న సమాధులను చూస్తున్నాయి.

హమీద్ మళ్లా అన్నాడు: "దాదాజీ! ఈ ప్రదేశంలో ఒంటరిగా ఉండవద్దు నీవు. నాతో వచ్చెయ్యి."

దాదాజీ ఉత్తరీయంతో కన్నీరు తుడుచుకొని, రుద్ధకంఠంతో, "నా కళ్ల ఎదట పెద్దబాబుగారు, పెద్దమ్మగారు, చిన్నమ్మ, చినబాబు, రవిబాబు, సుమతల్లి, నా లక్ష్మి ఈ ప్రదేశంలోనే మట్టిలో కలిసిపోయారు. నా అనే ఆత్మీయులంతా ఈ ప్రదేశంలోనే జీవించారు. ఇక్కడే కాలగర్భంలో కలిసి


చెమటకాయలు




నికో సబ్బు రుద్దుకొని స్నానము చేస్తే అది సేదదీర్చి చెమట కాయలనుండి ఉపశమనము కలిగించును. మరియు అది శరీరదుర్గంధము లేకుండాచేయును.

నికో
క్రిమిసంహారక సబ్బు
పార్క్-డేవిస్ ఉత్పత్తి
NAS b513b

అమర్‌కోస
(రిజిస్టర్డు)
స్వచ్ఛమైన గ్లూకోస పొడి. శీతల పానీయాలలో కలిపి త్రాగండి.
చక్కెరకు బదులుగా అమర్‌కోస వాడి చూడండి. ఎంత వ్యత్యాసంవుంటుందో మీకే తెలుస్తుంది. అదనపు పుష్టి నిస్తుంది. యువకులకు, ముదుసళ్లకు కూడా మంచిది. జబ్బుపడి లేచిన తర్వాత, ఆరోగ్యంగా వున్నపుడుకూడా వాడితే మంచిది. చాలా ఆదాయకరమైనదికూడా.
అమర్‌చంద్ శోభాచంద్
మద్రాసు-3.


EP-AS.11

పోయారు. ఇక నేను కూడా ఇక్కడే ... ఉహుఁ ఏ ఒక్క నాటికీ వదిలిరాను'' అన్నాడు.

హమీద్‌కు తెలుసు, దాదాజీ నిశ్చయానికిక తిరుగు లేదని. ఇక బలవంతం చెయ్యకుండా, ''నీ ఇష్టం, దాదాజీ. కాని ఒక్క కోరిక. రవి చెప్పాడు మీరు నాకంతా చెబుతారని. నాకు తెలుసుకోవాలని ఉంది, దాదాజీ'' అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు హమీద్.

దాదాజీ హమీద్ మొహంలోకి చూశాడు. అతని నేత్రాల్లో కన్నీరు తొణికిసలాడుతూంది.

''చెబుతాను బాబూ. నీకుకాక ఎవరికి చెబుతాను!'' అంతులేని దుఃఖంతో దాదాజీ గొంతు మూసుకుపోయింది. అతనిని ఓదార్చగలిగే శక్తి హమీద్‌కు లేదు.

''బాబూ, నా గతజీవితం నా హృదయానికొక వ్రణం. అది ఎన్నటికీ మానదిక. నా చావుతోనే అది మాసిపోతుంది. పసివారు రవి, సుమ దాన్ని చీలుస్తూ, నా జీవన జ్యోతిని రక్తమయం చేశారు. నిర్భాగ్యులైన ఆ పిల్లల ఉనికితో, నా హృదయ క్షోభ జ్వాల ఆర్పుకోలేకపోయాను. అదో, అటు చూడు బాబు.'' కన్నీళ్లు తుడుచుకుంటూ దూరాన ఉన్న పెద్దపెద్ద చెట్లవైపు చూపించాడ. హమీద్ చెట్లవైపు దృష్టి సారించాడు. ఆ చెట్ల వెనక శిలగా పాడుపడిన పెద్ద భవనం వెన్నెల్లో గోచరమయింది.

''అదే, బాబూ, అదే. ఒకనాడు భోగభాగ్యాలతో, కలకలలాడుతూ నిత్యసందడిగా ఉండేది. పెద్ద బాబుగారిది తరగని ఆస్తి. అమృతమూర్తులు అమ్మగారు, బాబుగారు లేదనకుండా ప్రతివారికి ఉపకారం చేసిన పుణ్యాత్ములు. మా వంశం అంతా బాబుగారి వంశాన్నే ఆశ్రయం చేసుకొని జీవించింది. పెద్దబాబుగారు ప్రతివిషయంలోనూ నా సలహా తీసుకొనేవారు. దివాణం అంతా నాకు చిర పరిచితం. చిన్నబాబును నా భుజాలమీద పెంచాను. పిల్లలు లేని నా కొరత చిన్నబాబు తీర్చేవాడు. బాబు పెరిగే కొలదీ అల్లరి మితిమీరింది. చాల ఆకతాయి తనంగ పెంకిగా ఉండేవాడు. చదువు ఒంటబట్టేది కాదు. బాబు పెరిగి పెద్దవాడయ్యాడు. బాల ప్రాయం దాటింది. నూనుగు మీసాల వయస్సు వచ్చింది. అప్పుడే నా ఒకే ఒక కూతురు లక్ష్మి పుట్టింది. లక్ష్మి అంటే అందరికీ ఎంతో ముద్దు. పెదబాబుగారు, అమ్మగారు లక్ష్మిని కన్నకూతురులా చూసుకొనేవారు. లక్ష్మి చిన్నతనం అంతా దివాణంలోనే, అమ్మగారి పెంపకంలోనే గడిచింది. లక్ష్మి పుట్టాక నా భార్య తులసి మరణించింది. పెద్దమ్మగారే నా చిట్టితల్లి లక్ష్మిని తల్లిలా సాకి పెంచారు. చిన్నబాబు పెద్దవాడయ్యాడు. ఆ బాబు చేసే తుంటరి పనులకు పెదబాబుగారు, అమ్మగారు కుమిలిపోసాగారు. ఎన్నో విధాల నచ్చజెప్పారు. కాని లాభం లేకపోయింది. చినబాబుది బండబారిన హృదయం, విర్రవీగిన మనస్సు. స్నేహితులతో కలిసి డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టేవాడు. అతడు చేసే ప్రతి ఘాతుకానికి డబ్బు విరజిమ్మి రక్షించేవారు పెదబాబు. అలా జరిగినప్పుడు ప్రతిసారి, 'ఇక వీడు ఏం చేసినా నేనేం చేయదలుచుకోలేదు.




## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన విరునామానూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1–25 పైకముమాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**

# కాల్గేట్ టూత్ బ్రష్
## మీ దంతములను ఎక్కువ శక్తివంతముగా శుభ్రపరుచునట్లుగా
తయారైనది!



చావనీ, జైలుగోడల మధ్య' అనేవారు. తిరిగి చిన బాబు ఏదైనా గొడవ తెస్తే, 'దాదాజీ, నా పేగు ఊరుకోదు. ఈ రక్తబంధం చాల పాపిష్ఠిది. నన్ను నిలవనియ్యదు' అని కుమిలిపోయేవారు.

"అందరూ ఆలోచించి, చిన్నబాబుకి చక్కటి అమ్మాయినిచ్చి పెళ్లి చేశారు. ప్రపంచంలోని నైర్మల్యం అంతా, తన కళ్లలో నింపుకొని శాంతి దేవతలా అత్తవారి భవనంలో అడుగు పెట్టింది, వెయ్యి ఊహలతో, కోటి కోర్కెలతో నవ వధువు చిన్నమ్మగారు. నూతన యౌవన దశలో ఉన్న ఆమె జీవన మధుపాత్రను చినబాబు విష కలుషితం చేసి వేశాడు. శాంత గంభీరమూర్తి అయిన తన కోడలి మొహంమీది విషాదరేఖలను చూచి, పెద్దమ్మగారు కుమిలిపోయారు. కుమిలి కుమిలి కృశించి చనిపోయారు. సంవత్సరం తిరక్కుండానే రవిబాబు పుట్టాడు. పుట్టినప్పటినుండీ అర్భకంగా, బలహీనంగా ఉండేవాడు. రానురాను క్షీణించిపోతున్న రవిబాబుకు ఎందరి వైద్యం చేతనో చికిత్సచేయించారు పెదబాబు. కాని రవి ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉండేది.

"అత్యున్నతము, అవిచ్ఛిన్నము అయిన ఆనందాన్నే ముక్తి అంటారు. మానవుడు మానవత్వాన్ని సజీవ సమాధి చేసుకుంటే, అతడు పాషండుడవుతాడు. ఎన్ని విషవలయాలలో అతని జీవితం చిక్కుకుపోతుందో మనం అవగతం చేసుకోవచ్చును. అదే చిన్నబాబులో జరిగిపోయింది. పదవీ గర్వంతో చెయ్యని అత్యాచారం లేదు. వాటివల్ల ఎన్నో భగ్న జీవితాలు ఆకుల్లా రాలి మట్టిలో కలిసిపోయాయి. ఎల్లప్పుడూ తాగుతూ, తూలుతూ, కంటికి అందంగా కన్పించిన ప్రతికన్యను వెంటాడుతూ, మృగతృష్ణలతో, అంతులేని మిత్రుల స్తోత్రాలతో రోజులు గడిపేవాడు. అగ్నిసాక్షిగా వివాహమాడిన ధర్మపత్నిని విస్మరించి అనూహ్యమైన క్షణిక సుఖాలలో మునిగితేలుతూ ఆత్మీయులందరి హృదయాలు తూట్లు చేసేవాడు.

"తరవాత తరవాత ధర్మప్రభువు పెదబాబు కూడా మరణించారు." చెప్పటం ఆపి దాదాజీ దీర్ఘంగా నిట్టూర్చాడు. అతని కనుగొలకుల నుండి కన్నీటి బిందువులు జారాయి.

"ఇక చినబాబుకి అడ్డూ, అదుపూ లేకపోయింది. నా మాట వినేవాడు కాదు. సరిగా ఇంటికి వచ్చేవాడు కాదు. ఆస్తి అంతా పోయింది. అప్పులు ఎక్కువయ్యాయి. ఎక్కడెక్కడో తిరిగి ఏ సంవత్సరానికో ఇంటికి వచ్చేవాడు.

"ఆ రోజు నాకు బాగా గుర్తుంది. పొలాలకు సంబంధించిన లెక్కలూ అవీ చూసుకుంటూండగా చిన్నమ్మగారు కబురు పంపారు. హడావిడిగా వెళ్లాను. రవిబాబును దగ్గిర పెట్టుకొని కూర్చొని ఉన్నారు. చిన్నమ్మగారిని చూస్తూంటే దుఃఖం ముంచుకు వచ్చింది నాకు.

'అమ్మా! పిలిచారట' అన్నాను.

'దాదాజీ! లక్ష్మికి వేగిరం మంచి సంబంధం చూడండి. వెంటనే పెళ్లి చేసేద్దాం. పరిస్థితులు బాగా లేవు' అన్నారు.

ఊహించని ఈ వింత మాటలు విని ఆశ్చర్యపోయాను.

'ఇప్పుడు తొందర ఎందుకమ్మా? నెమ్మదిగా చూద్దాం.' నవ్వుచెప్పుతూ అన్నాను.

'వద్దు, దాదాజీ! ఆలస్యం చెయ్యకండి. లక్ష్మికి వెంటనే ఏదేనా మంచి సంబంధం చూడండి. ఒక్క క్షణం లక్ష్మిని అలా ఉంచ వీలులేదు.'

లక్ష్మికి పదహారు సంవత్సరాలు అప్పుడు. మెరుపు తీగలా తిరుగుతూ అందరికీ ఆనందం కలిగించేది. లక్ష్మి మీద చిన్నమ్మగారి కెంతో ఆపేక్ష. లక్ష్మి పెళ్లికోసం ఆమె ఎందుకు ఇలా తొందర పడుతూందో నాకర్థం కాలేదు.

'అమ్మా!' ఏదో చెప్పబోయాను. నా మాట వినిపించుకోకుండా, 'దాదాజీ! నేను లక్ష్మిని కాపాడలేను. వెళ్లండి. వెంటనే ఏర్పాటు చెయ్యండి' అని అశ్రురుద్ధకంఠంతో అంటూ లోపలికి వెళ్లిపోయారు చిన్నమ్మ.

"నా కేమీ అర్థంకాక అలానే నిలుచుండి పోయాను. తరవాత వంట మనిషి చెప్పింది. 'లక్ష్మి తోటలో పువ్వులు కోస్తూంటే మేడమీదనుండి చినబాబు చూశారట. తరవాత నౌకరును, "ఎవ రా పిల్ల?" అని అడిగారట. అందుకని అమ్మగారు భయపడుతూ వెయ్యికళ్లతో లక్ష్మిని కాపాడుతున్నారు, దాదాజీ. మీ కీ సంగతి చెప్పద్దన్నారు.'

"ఆ మాటలు విని పిచ్చిగా నవ్వుకున్నాను. 'ఎంత దుర్మార్గుడైనా చినబాబు ఇంత ఘోరం చేస్తాడా, చిన్నమ్మగారి ఆందోళనకాని?' అనుకున్నాను. కాని, నేను ఊహించినది పొరపాటు. చిన్నమ్మగారి భయమే రూఢి అయింది. చిన్నమ్మ పోరువల్ల లక్ష్మికి సంబంధం నిర్ణయం చేశాను.

"లగ్నం తెల్లవారుజామున. పెళ్లి వస్తువు లేవో తీసుకురావటానికి పట్నం వెళ్లాను. చిన్నమ్మగారు నిండు గర్భవతి. అయినా ఉత్సాహంగా పెళ్లి పనులు చేయిస్తూంది.

ఆ రాత్రి లక్ష్మి నవ వధు వయింది. వేయి ఊహలతో జీవితం అంతా వలపు బాటలా ఊహిస్తూ, చుక్కలు విచ్చిన చక్కని ఆకాశం అంత పూల పందిరి కింద సుకుమారంగా తిరుగాడుతూ, ఆనంద మధువును ఆస్వాదిస్తూ, భవిష్యత్తును గూర్చి కలలు కంటూ ఆనందలహరిలో తేలిపోతూంది. గాఢ నిద్రలో తియ్యని కలలో మధురాతి మధురమైన సన్నివేశాలు పరుగులు తీస్తుండగా ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది లక్ష్మి. ఒక మదాంధుని కఠిన హస్తాలలో బంధిత అయి కెవ్వుమని అరిచింది. ఆ ఆర్తనాదం భవనం అంతా మారు మోగింది. కన్నుకానని కావరంతో కళ్లుపొరలు కమ్మిన ఆ దుర్మార్గుడి చర్యకు ప్రకృతి స్తంభించిపోయింది! లక్ష్మి ఆర్తనాదం చిన్నమ్మగారు విని నడకలేని పరుగుతో ఆయాసపడుతూ వచ్చారు. అసహాయంగా చిన్నబాబును విదిలించుకొంటున్న లక్ష్మిని చూసి ఆమె హృదయం క్షోభతో, జుగుప్సతో నిండిపోయింది. చినబాబు చేతుల నుండి తప్పించుకొన్న లక్ష్మి పరుగు పరుగున చిన్నమ్మగారి దగ్గిరికి వచ్చింది. అడ్డువచ్చిన భార్యను పక్కకు నెట్టి ఆ దుర్మార్గుడు లక్ష్మిని వెన్నంటాడు. ఆ అర్ధరాత్రిలో చినబాబును ఎదిరించే ధైర్యం, శక్తి ఎవరికీ లేకపోయింది. లక్ష్మి, నా లక్ష్మి ఆ కటిక చీకట్లో కంగారుగా అటూ ఇటూ పరిగెడుతూ, అవమానంతో కుమిలిపోతూ తన శీలాన్ని రక్షించుకొనేందుకు ఎటూ దారి లేక ఆ దొడ్లో మూలగా ఉన్న పాడు నూతిలోకి ఉరికేసింది. పెద్ద చప్పుడు! దాని వెనకే ఆర్తనాదం! శోషిల్లి వాలిపోయిన చిన్నమ్మగారు ఆ ఆర్తనాదం విని తెలివితప్పి పడిపోయారు. అప్పుడే, ఆ క్షణాన్నే సువరాణి పుట్టింది, ఆ దారుణ కృత్యాన్ని చూడలేనన్నట్లుగా పుట్టుగుడ్డిగా.

"మరునాటి పొద్దున్నే తిరిగి వచ్చాను నేను. ఆనాటి తెల్లవారుజామునే లక్ష్మి పెళ్లి ముహూర్తం



జ్ఞాని

ఫోటో — ఎస్. షా అలీ (హైదరాబాదు)

వెలవెలబోతున్న ఇంటిని చూసేసరికి నా కేమీ పాలుపోలేదు. లోపలకు వెళ్లాను. నాకు ఎదురుగా ఉన్న లక్ష్మి శవం చూసి స్పృహ తప్పి పడిపోయాను. విషయం చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. చిన్నమ్మగారిని వెతుక్కుంటూ పరుగులెత్తాను. పిచ్చి చూపులు చూస్తూ మంచాన్ని అంటుకొని ఉన్న చిన్నమ్మగారు నన్ను చూచి చిన్నపిల్లలా ఏడ్చారు.

'నా ముఖాన్ని మీకు చూపించలేను. వెళ్లిపొండి! దాదాజీ, వెళ్లిపొండి!' అంటూ రెండు చేతులతోను ముఖాన్ని కప్పుకున్నారు.

"అక్కడ నిలవలేకపోయాను. లక్ష్మి శవం దగ్గిరికి పరిగెత్తాను. అప్పటి నా పరిస్థితి నీకు వివరించలేను, బాబూ. సౌభాగ్యలక్ష్మివలె పెళ్లిపీటల నలంకరించవలసిన నా ముద్దుల కూతురు దారుణమైన మర



TIARA

టియారా మీస్నానానికి సంపూర్ణత సమకూరుస్తుంది

స్నానంచేసాక మీలోని స్త్రీయత్వం, కొంటితనం మురిసి పోవాలనుకొంటారా? టియారా లనోలిన్ వంటిమీద బాగాజల్లుకొనండి. టియారా మీ సౌందర్యానికి అపురూపమైన శోభచేకూరుస్తుంది. దాని మృదుసువాసనలు మీ చెవులలో రహస్యాలు చెబుతాయి. దీనిలోలనోలిన్ వుండి, చర్మసంరక్షణకూ, శరీరంచీటలు పడకుండావుండేటందుకు—ఉపయోగపడే ప్రకృతి సిద్ధమైన పదార్థమిది. అంతేకాక శరీరపు దుర్వాసనలను ఇది పైకిరానీయదుకూడా. టియారాను నిత్యము ఉపయోగించండి. ఇదిమీ స్నానానికి సంపూర్ణత సమకూరుస్తుంది. రాత్రికి శోభచేకూరుస్తుంది

J.K. Helene Curtis

సోల్ డిస్ట్రిబ్యూటర్లు: స్పెన్సర్ అండ్ కంపెని లిమిటెడ్




PRESYN/HC/6A/66

# శాపఫలం

ణానికి ఆహుతి అయింది. నా ఆశలన్నీ కల్లలుచేసి వెళ్లిపోయింది. జరిగినదంతా తెలుసుకున్నాను. భగభగ మండిపోతున్న నా లక్ష్మి చితిముందు కన్నీళ్లతో నిలుచున్న నా నరనరాలు పగతో, క్రోధంతో కంపించిపోయాయి.

"దుర్మార్గుడు! కన్నబిడ్డలా పెంచాను. కన్న కడుపులోనే చిచ్చు పెట్టాడు. ఎంత ఘాతుక చర్యకు పాల్పడ్డాడు! ఎంత ఘోరం! వాణ్ణి ఉంచరాదు. వాణ్ణి చంపి, ఆ రక్తంతో నా పగ చల్లార్చు కుంటాను. నాలోని రాక్షసత్వం కట్టలు తెంచు కొంది. కత్తిని బాగా నూరి బయలుదేరాను.

అంతలో 'చిన్నమ్మగారు పిలుస్తున్నా'రంటూ కబురు వచ్చింది. నాకు ఎక్కడలేని విసుగు, కోపం వచ్చాయి. నా కర్తవ్యం చిన్నబాబును చంపటం! అప్పుడే నా మనస్సుకు శాంతి! కాని, చిన్నమ్మ గారు! నే నామెకు ఏం చెయ్యబోతున్నానో అర్థం చేసుకొనేసరికి తల తిరిగిపోయింది. కసితీరా భగ వంతుణ్ణి తిట్టుకున్నాను. భారమైన అడుగులతో ఆమె దగ్గిరికి వెళ్లాను. వరదలా పొంగి వచ్చే కన్నీ టికి అతి ప్రయాసతో ఆనకట్టలు వేసి, పాలిపోయిన పెదవులను మాటిమాటికి తడుపుకుంటూ, విషా దాన్ని వేరుమందులా మింగి పడుకొని ఉంది చిన్నమ్మగారు. మౌనంగా ఆమెను నమస్కరించి కత్తి కనపడకుండా దాచేశాను.

"అశ్రువ్యాకుల కంఠంతో, 'దాదాజీ! కాలాన్ని నడిపే భారం మనమీద లేదు. కాలాన్ని సృష్టించిన వాడే దాన్ని నడిపిస్తాడు' అన్న ఆమె మాటలకు భయవిహ్వలచిత్తుడ నయ్యాను.

'తప్పు తప్పే. ఎవరు చేసినా, ఏ పరిస్థితులలో చేసినా, అనివార్యమే అయినా అది విచక్షణ జ్ఞానాన్ని పోగొట్టి దేవతల్ని సహితం దానవుల్ని చేసి మాన వత్వం మనుగడకే ప్రమాదం చేకూరుస్తుంది.' అప్పటికీ చలనం లేకుండా అలానే నిలుచుండిపోయాను.

చిన్నమ్మగారు నెమ్మదిగా లేచి కూర్చున్నారు.

'నా మనస్సులోని విషయమంతా చెప్పాను. క్షమించడం చేతనయితే క్షమించు. నమ్మిక భగ్న మైననాడు నిరాశతో గుండె బద్దలవుతుంది. నిన్ను రాక్షసుణ్ణిగా చూడలేను, దాదాజీ. వద్దు. నీ కళ్లల్లో ఆ క్రౌర్యం వద్దు.' పిచ్చిదానిలా తూలుతూ అన్నారు.

"నాలో ఏదో తెలియని జాలి, ప్రేమా, వాత్సల్యమూ కట్టలు తెంచుకున్నాయి.

"కత్తి దూరంగా పారవేశాను. 'అమ్మా!' అంటూ ఆమె పాదాలమీద వాలిపోయాను. వణికే చేతులతో లేవి, నుమను హతమార్చాలనుకున్న నా చేతులలో, ఏ దుర్మార్గుణ్ణి చంపాలని కత్తి వాడిగా నూరుకున్నానో ఆ చేతులలో అతని రక్తాన్ని పంచు కొని పుట్టిన ఇద్దరు బిడ్డల్ని పెట్టింది చిన్నమ్మ గారు.

'దాదాజీ! ఈ పాపిష్ఠి వాతావరణం నుండి

పిల్లిద్దర్ని దూరంగా తీసుకుపోయి, పెంచు! ఏ అంశతో వీరు జన్మించారో ఆ మలినపు ఛాయలు సోకకుండా చూడు! అదే నే కోరేది' అంటూనే వెనక్కు వాలి పోయింది చిన్నమ్మగారు. అంతే! మూసుకుపోయిన ఆ నేత్రాలు మళ్లీ తెరుచుకోలేదు.

"ఈ చేతులతోనే చిన్నమ్మగారి అంత్యక్రియలు చేశాను. సుమను, రవిని తీసుకొని భారమైన మనస్సుతో ఆ భవనం దాటాను. ఆ భవనానికి, పరిసరాలకు దూరంగా ఇక్కడ, ఈ తోటలో ఈ చిన్ని కుటీరం నిర్మించుకున్నాను. పూర్తిగా వ్యసనలోలుడై, విచ్చలవిడిగా తిరుగుతున్న చినబాబును ఎవరూ లేని చోట ఎవరో అతని మీద కసితో చిత్రవధ చేశారు. భగవాన్! ఎంత క్రూరంగా చంపారు! పాపాలకు ఫలితం అనుభవించాడు! ఆస్తిపాస్తులన్నీ అప్పులవాళ్ల వశం అయ్యాయి. అనేకమయిన చల్లని జీవితాలను బలిగొన్న ఆ పాపిష్ఠి భవనం 'దయ్యాల కొంప'గా ప్రచారం చెంది, ఎవరికీ పనికి రాకుండా పాడుపడిపోయింది. బతికినంతకాలమూ నరకయాతన పొంది, ఈనాడు హాయిగా శాశ్వత శాంతిలో ఉన్న ఆ అభాగ్యులు 'దయ్యాలు'గా తిరుగుతున్నారని ఊళ్లో వాళ్ల పిచ్చి నమ్మకం. అందుకే ఈ ప్రాంతాలకు ఎవ్వరూ రారు."

గాఢంగా నిశ్వసించాడు దాదాజీ. "ఇదీ నాయనా, నా చరిత్ర. ఈ అనుభవాలతో నా జీవితం బండబారిపోయింది. నేనెప్పుడూ జీవితాన్ని ద్వేషించలేదు బాబూ. జీవితాన్ని ప్రేమించాను. అపజయాల్ని, నిరాశల్ని సైతం చిరునవ్వుతో ఎదుర్కొన్నాను. ఇది నాకు చిన్నమ్మగారు నేర్పారు."

క్షణం ఊరుకొని తిరిగి అన్నాడు దాదాజీ:

"ఈ జీవితం విచిత్రమైనది. మనం దాన్ని అర్థం చేసుకోలేము. పరిస్థితులకు అతీతులం కాలేము. అదృష్టం, దురదృష్టం, సుఖదుఃఖాలు— ఏమి టివి? వీటిని నిర్వచించలేము. ఈ బతుకులో అదృష్టదేవత వరించేది కొందరిని మాత్రమే. దురదృష్టపు నొసటి రాత పుట్టుకతోటే తేలిపోతుంది. రవి, సుమ ఎంత నిర్భాగ్యులు!" దాదాజీ చూపులు దూరంగా శూన్యంలోకి చూస్తున్నాయి. ఆ వంకకే దృష్టి సారించాడు హమీద్. తెల్లని వెన్నెల్లో తోటలోని సమాధులు తెల్లగా అగుపిస్తున్నాయి. జీవిత పోరాటంతో విసిగి, వేసారి ఓడిపోయి అనంతమైన నిద్రలో మైమరిచి ఉన్న ఆ భగ్న జీవులను తలుచుకొనేసరికి గుండెల నిండా విషాదం కమ్ముకుపోయింది హమీద్‌కు. దాదాజీ వంక చూశాడు.

దాదాజీ కళ్లలో ఆవేదన, క్షోభ కన్నీటి బిందువుల మధ్య తొణికిసలాడుతున్నాయి. హమీద్ కళ్ల నిండా నీరు తిరిగింది. కన్నీటి పొరల మధ్య దాదాజీ కళ్లలో పెద్దబాబు, పెద్దమ్మగారు, చిన్నమ్మగారు, చినబాబు, లక్ష్మి, రవి, సుమ లీలగా కనిపించినట్లయింది.

మౌనంగా తలవంచి, దాదాజీ పాదాలను అత్యంత భక్తిభావంతో కళ్ల కద్దుకున్నాడు హమీద్.

(సమాప్తం)


మీ ఆహారమును
ఆరోగ్య ప్రదంగా
Meghdoot రాగి
అడుగు భాగములుగల
స్టెయిన్ లెస్ స్టీల్
పాత్రలలో వండుకోండి!



● రాగి అడుగు భాగములతో
ఆహారము కాలిపోదు, మాడిపోదు.
● అవి వేడిని సమముగా ఎక్కేలా
చేస్తాయి.
● వాటిని శుభ్రపరచుట, శుభ్రముగా
ఉంచుట సులభము...కడిగి
తుడిచివేస్తే చాలును!

రాగి అడుగు భాగములుగల స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు వంటకు అత్యుత్తమమైనవి. అంతేకాక అవి ఒక జీవితకాలం మన్నుతాయి. వాటిని నేడే కొనండి. వాటితో వండడము సరదాగా వుంటుంది.... శుభ్రము చేయడము ఎంతో తేలిక!

మీ ప్రాంతములోని ప్రసిద్ధ పాత్రల దుకాణములన్నిటిలోను లభించును.

మహాలక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్

192 బి, పంజారపోల్ రోడ్, బొంబాయి-4 ఫోన్ 334036, 335473.

ఈ ట్రేడ్ మార్క్ కోసం చూడండి Meghdoot

LPE Aiyars / J TEL